
## క్లుప్తంగా

### వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వర స్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

### కిడ్నీ బాధితులకు సాయం



కిడ్నీ బాధితులకు చెక్కులు అందజేస్తున్న బుద్దరాజు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వసుధ ఫౌండేషన్ సభ్యులు శనివారం ఇద్దరు కిడ్నీ బాధితులకు ఆర్థిక సహాయం అందించారు. మొగల్తూరు మండలం నీటితిప్ప గ్రామానికి చెందిన వి.బాలాజీరావు, ఎం.ఏడుకొండలు ఇద్దరు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. వీరి సమస్యను తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఇద్దరికి చెరో రూ.10 వేలు చొప్పున రూ . 20 వేలు చెక్కులను పంపించగా పట్టణ వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పిబుద్ధరాజు బాధితులకు చెక్కులను అందజేశారు.

### వశిష్ట గోదావరికి పంచ హారతులు



గోదావరి మాతకు హారతి ఇస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం వశిష్ట గోదావరి వద్ద శనివారం రాత్రి పౌర్ణమి సందర్భంగా సిద్ధాంతం హిందూ ధర్మ పరిరక్షణ సమితి వారి ఆధ్వర్యంలో మానేపల్లి వెంకట సుబ్బారావు, కనకదుర్గ దంపతులు ద్వారా గోదావరి మాతకు 'పంచ హారతులు' అతి వైభవంగా నిర్వహించారు. కలగబద్రుడు స్వామి బ్రహ్మత్వంతో ఏకముక, ద్విముఖ, చతుర్థ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ, కుంభ, సర్ప, హారతులు వశిష్ట గోదావరికి ఇచ్చారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులు మాట్లాడుతూ నదీమతల్లులను ఆరాధించడం అనాదిగా వస్తున్న మన సంప్రదాయమని తెలిపారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

### చెరుకువాడలో రోడ్డు ప్రమాదం

ఉండి: మండలంలో చెరుకువాడ శివారు జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పెద్ద ఆంజనేయస్వామి విగ్రహానికి సమీపంలో ఉండి వైపు నుంచి ఆకివీడు వైపుగా వస్తున్న ఆటో, ఆకివీడు వైపు నుంచి ఉండి వైపుగా వస్తున్న మినీ ట్రక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలు ఉన్న మహిళా ప్రయాణికులరాలికి, ఆటో డ్రైవర్‌కి గాయాలయ్యాయి. వారిని 108 సహాయంతో ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమా దంపై పూర్తి వివరాలు తెలియ లేదని, ఆసుపత్రి నుంచి అందే సమాచారం మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు.

### వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కాళ్ల: మండలంలోని కోపల్లె గ్రామం శనివారం శివ నామస్మరణతో మారుమోగింది. గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి దేవదాయ, ధర్మదాయశాఖ, గ్రామస్తులు పూనుకున్నారు. ఎంతో సుందరంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 14న ప్రతిష్ఠించబోయే రాతివిగ్రహాలకు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నూతన విగ్రహాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. 14న సోమవారం ఉదయం గం.8.30 ని.లకు నూతన ఆలయంలో స్వామి అమ్మవార్ల విగ్రహ పునఃప్రతిష్ఠ, కుంబాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఇప్పటికే ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

# గుదిబండలా పెనుగొండ డంపింగ్ యార్డు



పెనుగొండ డంపింగ్ యార్డుతో బక్క చిక్కిన నక్కల డ్రెయిన్



డంపింగ్ యార్డులో సగం ఆక్రమించిన సంపద సృష్టి కేంద్రం



పెనుగొండ డంపింగ్ యార్డు

- నక్కల డ్రెయిన్ ఆక్రమించి సంపద సృష్టి కేంద్రాల నిర్మాణం
- శివారుకు నీరు రావడం లేదని రైతుల ఆవేదన

పెనుగొండ: పెనుగొండ డంపింగ్ యార్డు ఇటు పంచాయతీకి, అటు రైతన్నలకు గుదిబండలా మారింది. పెనుగొండ శివారు నక్కల డ్రెయిన్‌కు ఆనుకొని కొన్ని దశాబ్దాలుగా డంపింగ్ యార్డు నిర్వహిస్తున్నారు. ఆదిలో అతి పెద్ద డంపింగ్ యార్డుకు ఉన్నా, పెరుగుతున్న జనాభా, గ్రామంలో పెరుగుతున్న వ్యర్థాలతో డంపింగ్ యార్డు పరిమితిని మించి చెత్తా చెదారాలు రావడతో రోజురోజుకు పారిశుద్ధ్యసిబ్బందికి డంపింగ్ యార్డు వద్ద వాహనాలను చెత్తా చెదారాలను దిగుమతి చేయడం ఇబ్బందికరంగా మారింది. ఇదిలా, ఉండగా ఆరేళ్ల క్రితం ఆనాటి ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టి కార్యక్రమం చేపట్టి సగం డంపింగ్ యార్డులో సంపద సృష్టి కేంద్రాలు నిర్మించడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. దీంతో చెత్తాచెదారాలను నక్కల డ్రెయిన్ గట్టు పొడవునా వేయడం ప్రారంభించారు. దీంతో నక్కల డ్రెయిన్ పెనుగొండ వద్ద బక్కచిక్కిపోయింది. వర్షాకాలంలో నక్కల డ్రెయిన్ నీరు క్రిందకు వెళ్లడం కష్ట సాధ్యంగా మారింది. దీంతో పరిసర ప్రాంత రైతులు పదేపదే నక్కల డ్రెయిన్ వద్ద డంపింగ్ యార్డు ఫిర్యాదు చేయడంతో మరింత తలనొప్పిగా మారింది.

**స్థల సేకరణ భారం**

ఇటీవల డంపింగ్‌యార్డు కొత్త స్థలం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే కొత్తగా స్థల సేకరణ చేయడం పంచాయతీకి భారంగా మారింది. కొనుగోలు చేసే స్థోమత పంచాయతీకి లేకపోవడంతో, డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలంటూ రెవెన్యూ శాఖకు విజ్ఞప్తి చేసింది. దీంతో డంపింగ్ యార్డు స్థలం కేటాయించడానికి రెవెన్యూ అధికారులు పోరంబోకు, ఇతర అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలపై దృష్టి సారించారు. ఈ కోవలోనే సుమారు రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమై ఉందని అధికారులు దృష్టికి రావడంతో ఆ భూమిని స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డుకు కేటాయించాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

**వర్షాకాలం లోపునే పరిష్కరించాలి**

వర్షా కాలంలోపునే డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలంటూ ఇటు పంచాయతీ, పారిశుద్ధ్య సిబ్బంది కోరుకొంటున్నారు.వర్షాకాలంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో దిగుమతి చేయడం కష్ట సాధ్యంగా మారుతుంది. చినుకు పడితే చాలు డంపింగ్ యార్డులోకి వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో పెనుగొండ సిద్ధాంతం రోడ్డు పొడవునా నక్కల డ్రెయిన్ వద్ద దిగుమతి చేయాల్సి వస్తుంది. దీనిని మళ్లీ వర్షాలు తగ్గిన అనంతరం డంపింగ్ యార్డులో వేయాల్సి వస్తుంది. ఇలా వేయడం పంచాయతీకి ఆర్థిక భారంగా మారింది. స్థలం కేటాయింపు వల్ల ఆర్థిక భారం తగ్గుతుందని, ఈ నిధులు అభివృద్ధికి వినియోగించుకోవచ్చునని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



దొడ్డిపట్ల హైస్కూల్ ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

యలమంచిలి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంఈఓ ముదునూరి వెంకట రామకృష్ణంరాజు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి శనివారం విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని ప్రతి హైస్కూల్‌కు వెళ్లి అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను కలిసి వారందరికీ ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు ఓటేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులతో గోపిమూర్తి మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత రద్దు చేయకుండా కేవలం సవరణలు చేసిందని విమర్శించారు. ఈ జీఓతో నష్టపోతున్న పాఠశాల పరిరక్షణకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్, మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తిందీవి శ్రీనివాస్, పంతం రామమూర్తినాయుడు, గౌరవాధ్యక్షులు వి జగ్గారావు, ఉపాధ్యక్షులు కె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కళాకారులకు సత్కారం

భీమవరం(ప్రకాశంచౌక్): తోలుబొమ్మలాట కళాకారులకు శ్రీవిజ్ఞానవేదిక, పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మావుళ్లమ్మవారి దేవస్థానంలో ఆశీర్వచనాలు, అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, కళాకారుల సంఘం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అనంతపురం ధర్మవరంలో వేల తోలుబొమ్మల తయారుచేస్తూ వేల ప్రదర్శనలు అందించి నేడు మర్షియస్ దేశంలో ప్రదర్శనకు ఆహ్వానంపై వెళ్లడం మన భారత కళా రంగానికే గర్వకారణమని అన్నారు. అనంతరం తోలు బొమ్మలాట కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి ఏం సీతారామ్ ప్రసాద్, ఎస్ కే చాన్ భాషా, ఆలయ ఈఓ బుద్ధ మహాలక్ష్మి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండల్లో జాగ్రత్తలు తప్పనిసరి



గ్రామ సచివాలయాల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: వేసవి కాలం ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ప్రజలు వేడికి అల్లాడుతున్నారు. రానున్న రోజుల్లో భానుడు మరింత ఉగ్రరూపం దాలుస్తాడని ప్రచారమైతే జోరుగా సాగుతుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల చిన్న, పెద్ద, వృద్ధులు అనే తేడా లేకుండా వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంటుంది. ప్రతిఒక్కరూ వడదెబ్బ తగలకుండా నివారణ చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎక్కువ ఉష్ణోగ్రతల వల్ల మనిషి ఆ వేడికి గురైన సందర్భంలో శరీరంలో వేడిని నియంత్రించే విధానం తగ్గడంతో ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడటాన్ని వడదెబ్బ అంటారు. చాలా వేడి వాతావరణం లేదా చురుకైన పనులు వల్ల కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా శరీర ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తాయి. దాంతో ఆ వ్యక్తి నీరసించి పడిపోవడం వల్ల వడదెబ్బ తగిలిందని గుర్తిస్తారు. గుండె, నాడి వేగంగా కొట్టుకోవడం, తక్కువగా శ్వాస తీసుకోవడం, చెమట పట్టకపోవడం, హెచ్చుతగ్గుల రక్తపోటు, చిరాకు, కంగారు, అపస్మారక స్థితి, తల తిరగడం, తేలిపోవడం, తలపోటు, వికారం వంటి లక్షణాలు ఉంటే వడదెబ్బగా గుర్తించాలి.

**వడ దెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడపట్టున కూర్చోబెట్టాలి. ఆ వ్యక్తి శరీరం చల్లబరిచే విధంగా చర్యలు చేపట్టాలి. అవసరమైతే చల్లని నీటితో శరీరాన్ని తడపాలి. తాగగలిగితే చల్లని పానీయాలు ఇవ్వాలి. దుస్తులు వదులుగా చేయాలి. ఎటువంటి మందులు ఇవ్వకుండా వైద్యులను సంప్రదించాలి.

#### వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవి ఉష్ణోగ్రతల వల్ల మనిషికి డీ–హైడ్రేషన్ అధికంగా ఉంటుంది. అందువల్ల తాగునీరు నిత్యం దగ్గర్లో ఉండాలి లేదా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. నీళ్లు తాగడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది.
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో నీడ పట్టున ఉండేలా చూసుకోవాలి. అనారోగ్య సమస్యలు ఉన్న వారు డీ–హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- శరీరంలో ఉష్ణోగ్రతను పెంచే ఆల్కహాలు, సిగరెట్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి.
- తప్పని పరిస్థితుల్లో ఎండలో వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా కూలింగ్ కళ్లద్దాలు, టోపీ పెట్టుకోవాలి.
- ఆహారలోం మషాలా, కారం వంటివి లేకుండా తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.
- బయటకు వెళ్లేటప్పుడు కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, సోడియం వంటి ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలు వంటివి సేవించడం చాలా మంచిది.

#### రక్షణ చర్యలు తీసుకోవాలి



వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల వల్ల డీ–హైడ్రేషన్ సాధారణంగా వచ్చే వ్యాధులు. సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే ప్రాణాంతకం అవుతుంది. ముఖ్యంగా మాంసాహారం తగ్గించి శాఖాహారం తీసుకోవాలి. రోజుకు 15 గ్లాసులు నీటిని తాగాలి. ఎక్కువగా ఎండల్లో తిరగకూడదు. రోడ్డుపై విక్రయించే రంగుల పానీయాలు తాగకూడదు. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు వంటివి సేవించాలి. తేలిక దుస్తులు వాడాలి. పీహెచ్‌సీలెట ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్స్ అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్, వైద్యుడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లంకలకోడేరు

# సేవ చేయడమూ ఓ అదృష్టమే



కైలాస రథం వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ప్రతి ఒక్కరికీ సేవ చేయాలని ఉంటుంది. కాని ఆ సేవ చేయడానికి కూడా సంకల్ప బలం ఉండాలని, అప్పుడే అది సాధ్యమవుతుందని మాజీ శాసనసభ్యులు అల్లు వెంకట సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ఆధ్వర్యంలో వారి తండ్రి యడ్ల గణేశ్వరరావు పేరున సేవా ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ తాతాజీకి కూడా సేవ చేయాలని ఎప్పటి నుంచో ఉంది. కాని అది నేడు ఆచరణలోకి వచ్చింది అంటే సేవ చేయడం కూడా ఒక అదృష్టమేనని అది ఇప్పటికి నెరవేరిందని అన్నారు. పాలకొల్లు పట్టణంలో సేవ చేయడంలో ఆర్యవైశ్యులకు ఎవ్వరూ సాటిరారన్నారు. యడ్ల గణేశ్వరరావు సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పార్టీలు, వర్గాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేయనుండడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా కైలాస రథం అల్లు సత్యనారాయణ ప్రారంభించారు. అలాగే ఐదుగురు మహిళలకు కుట్టు మెషీన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు, గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనందప్రకాష్, నడపన గోవిందరాజులు నాయుడు, గుణ్ణం సర్వారావు, యినకొండ రవి, రావూరి బుజ్జి, ఉచ్చుల స్టాలిన్, మామిడి బాబు, బోణం బులివెంకన్న, విప్పర్తి ప్రభాకర్, మద్దా చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



నరసాపురం: అత్యధిక మార్కులు సాధించిన ఆదిత్య విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు



పెనుగొండ: ఎస్‌వీకేపీ కళాశాల విద్యార్థులతో అధ్యాపకులు



పాలకొల్లు సెంట్రల్: విశ్వ కళాశాల విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో నరసాపురం ఆదిత్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఎస్. శివకోటప్రసాద్ శనివారం విలేకరులకు చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో మోకా సూర్యనిఖిల్, బొడ్డు త్రివేణి, బైపీసీలో గడ్డం ఎలిజిబెత్ శామ్యూల్, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో చిక్కాల బాలాజీ, అద్దాల అమృత, బైపీసీలో తమ్మిశెట్టి సాహితి, పాలంకి రమ్యశ్రీలక్ష్మి మంచి మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్.రాఘవరెడ్డి అభినందించారు. అలాగే పట్టణంలోని శ్రీ గౌతమి విద్యార్థుల మార్కుల వివరాలను చైర్మన్ చినిమిల్లి దుర్గాప్రసాద్ చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో తరపట్ల తరపట్ల చైతన్య, ఎన్.విషిత, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో బొడ్డు గోపిక, బైపీసీలో ఎండీ ఫరీహ ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులను దుర్గాప్రసాద్, సూపరింటెండెంట్ ఎండీ ఘఫార్‌ఖాన్ అభినందించారు. పట్టణంలోని శ్రీసూర్యా కళాశాల విద్యార్థులు ఏడాది కూడా టాప్‌ఫస్ట్ సాధించినట్టు కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కోలా యశ్వంత్, పొన్నాడ కీర్తన ప్రమీల, సీనియర్ ఎంపీసీలో దామన ఉషశ్రీ, రావి వినయలక్ష్మి ప్రతిభ చూపారని పేర్కొన్నారు.

**పెనుగొండలో..**

పెనుగొండ: ఇంటర్మీడియట్ పరీక్షల్లో పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ శనివారం విలేకరులకు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో కొండవీటి ఆదిత్య యశస్వి, పెదపూడి సుప్రియ, నక్కా రాజాబాబు, జూనియర్ ఇంటర్‌లో చిట్టాల బాల సత్యదుర్గారావు, మరపట్ల బొమ్మన, బంగారు రామగణేష్ ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి , సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు అభినందించారు. అలాగే సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ విభాగంలో ఇంటర్ మహిళా కళాశాల ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 63 శాతం, ప్రథమ సంవత్సరంలో 55 శాతం ఫలితాలు సాధించారని అధ్యాపకులు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన బైపీసీ, సీఈసీ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు ఒక్కొక్కరికీ రూ.10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఒక్కొక్కరికీ రూ.5 వేలు వంతున, తృతీయ స్థానం సాధించిన ఒక్కొక్కరికీ రూ.2,500 వంతను గ్రామానికి చెందిన మండవిల్లి హరిప్రసాద్ నగదు బహుమతులు అందించారన్నారు.

**పాలకొల్లులో..**

పాలకొల్లుసెంట్రల్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కోకోనట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 82 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బొక్కా అప్పారావు శనివారం విలేకరులకు తెలిపారు. సీనియర్ ఇంటర్ పాలపర్తి ప్రవల్లిక, విప్పర్తి కీర్తన, కందిపల్లి విమల కుమారి, బీవై శ్రీలక్ష్మీ ప్రతిభ చూపారన్నారు. అలాగే ఆదిత్య జూనియర్ కళాశాలలో బొక్కా పల్లవి, బి.పద్మజ్యోతి, సీహెచ్ సాహితి, సీహెచ్ వరుణ్ సాయితేజ, టి.కెనన్యా ఎంవీ సూర్య అనిరుధ్, ప్రతిభ చూపారని ఆ కళాశాల సిబ్బంది తెలిపారు. అలాగే మాంటిస్సోరి విద్యార్థులు లక్కింశెట్టి గీతా హారిక, ముదునూరి మనోహరి, వేమన ధనలక్ష్మి, వంకా ప్రవల్లిక ప్రతిభ చూపారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ కేవీ కృష్ణవర్మ తెలిపారు. అలాగే విశ్వ జూనియర్ కళాశాలలో చెల్లుబోయిన సాయి సంయుక్త, గుబ్బల మీనాక్షి, పెన్మెత్స మన్విత, సలాది పూజా కృష్ణవేణి మంచి ప్రతిభ చూపారని ఆ కళాశాల ఏఓ ఏలూరి శేషగిరిరావు తెలిపారు. అలాగే చాంబర్స్ కళాశాలలో బాలం తేజస్విని, కె.గౌతమి, ఆర్.యర్రంనాయుడు పి.అనూష, కె.లక్ష్మీ ప్రసన్న, బూడి హారిక, ఐ.లక్ష్మణ్ వర్షిత్ ప్రతిభ చూపారని కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు విద్యార్థులను అభినందించారు.

### కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు



గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమైన దృశ్యం

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతుంది. ముఖ్యంగా పడవలరేవు నుంచి కొండాలమ్మగుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు చాలా చోట్ల కంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా మార్నింగ్ వాక్ చేసేవారు. సాయంత్రం వేళలో గోదావరి తీరానికి విహారానికి పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులపై దృష్టిపెట్టడంలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

### నెగ్గిపూడిలో వైభవంగా రథోత్సవం



నెగ్గిపూడిలో సీతారామచంద్రస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని నెగ్గిపూడి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారిని ప్రత్యేక రథం పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు కోలాటం నృత్యాలతో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని రథాన్ని వెనుక వెళ్తూ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం రాత్రి ఆలయం వద్ద సీతారామచంద్ర స్వామికి మల్లెలు సమర్పిస్తూ పవళింపు సేవ నిర్వహించారు.

### అగ్నిప్రమాదంలో గోనె సంచులు దగ్ధం

కాళ్ల: మండలంలోని జువ్వలపాలెం గ్రామంలోని గోనె సంచుల గోడౌన్‌లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం తెలుసుకున్న ఆకివీడు ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని ఆకివీడు ఫైర్ ఆఫీసర్ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు ఆయన పేర్కొన్నారు.

### పెనుమంట్రలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



సీతారాములను దర్శించుకుంటున్న షర్మిల రెడ్డి



ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ

పెనుమంట్ర: స్థానిక స్టేట్ హైవే రోడ్డు పక్కన ఉన్న ఊర చెరువుకు ఇరువైపులా ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి తీర్థ మహోత్సవం, శ్రీ భద్రాద్రి సీత రామ స్వామి వారి తెప్పోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. రెడ్డి యూత్, శ్రీ కనకదుర్గ అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాల నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన బోటులో సీతా భద్రాద్రి రాముని ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. చెరువు చుట్టూ విద్యుత్ దీపాలంకరణ చేసి బాణసంచా కాల్చారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి శ్రీ సీతారామలతెప్పోత్సవంలో పాల్గొని, శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.

### పాలకోడేరు జెడ్పీ హైస్కూల్ సందర్శన

పాలకోడేరు: స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర స్టేట్ అబ్జర్వర్ ఇస్మాయిల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలు భాగంగా స్టాక్ పాయింట్, రూమ్స్ అన్ని నిశితంగా పరిశీలించి సీఆర్‌ఎంటీలు, పీటీఐలకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట సీఎంఓ చంద్రశేఖర్, ఎంఈఓలు ఉన్నారు.